RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 262 | సంపుటి 4 | బుధవారం | 17-06-2026 | పేజీలు 4 | వెల 3/-

## తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక..

— వివరాలు 2వ పేజీలో




## ఈ నెల 18న 2కే రన్

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి
- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



3

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

- కేసముద్రం మండలం కల్వల గ్రామంలో ఘటన
- తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదం
- ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంఘాల డిమాండ్



04



2

## విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు

# సమగ్ర కార్యాచరణ

- రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికలు : సీఎం రేవంత్ రెడ్డి
- వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం..
- రైతు వేదికలను సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు
- ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ఉన్నతాధికారుల ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- సన్న వడ్ల రైతులకు బోనస్ తో పాటు సబ్సిడీపై విత్తనాల పంపిణీ
- ఎరువుల బుకింగ్ కు యాప్, వ్యవసాయంలో ఏఐ వినియోగంపై సీఎం దృష్టి

రైతు పంట సాగు ప్రారంభించే దశ నుంచి ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధర పొందే వరకు ప్రతి అడుగులోనూ ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలిచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విత్తనాల సరఫరా, పంటల నమోదు, దిగుబడి అంచనాలు, ఎరువుల పంపిణీ, ధాన్యం కొనుగోళ్లు, మార్కెటింగ్, నిల్వ సదుపాయాల వరకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేసి, అక్కడే రైతుల నమోదు, విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న సీఎం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.




## 24 గంటల్లోనే వీడిన

# మర్డర్ మిస్టరీ..

3

- భర్త హత్య కేసును ఛేదించిన పోలీసులు!
- నిత్యం వేధింపులు, అనుమానాలే కారణం..
- ఇనుప రాడ్ తో కొట్టి చంపిన భార్య, మరో ఇద్దరు..
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో సంచలనం సృష్టించిన కుండే నరేష్ హత్య కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. భర్త వేధింపులను తట్టుకోలేక ముందస్తు ప్రణాళికతో భార్య అనూష, ఆమె తల్లిదండ్రులు కుమారస్వామి, కనకమ్మ కలిసి ఇనుప రాడ్ తో నరేష్ ను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్ తో పాటు పరారీకి వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.

# యువకుడి దారుణ హత్య

- కేసముద్రం మండలంలో దారుణం:
- అత్తగారింట్లోనే అల్లుడి దారుణ హత్య!
- కుటుంబ కలహాలే కారణమనే అనుమానాలు
- ఇనుప రాడ్లతో తలపై బాది ఘాతుకం
- మహబూబాబాద్ జిల్లా ఉప్పరపల్లిలో కలకలం

కుటుంబ కలహాలు చివరకు ఓ వ్యక్తి ప్రాణాలు బలిగొన్న విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. అత్తగారింటికి వెళ్లిన 36 ఏళ్ల కుండె నరేశ్ పై ఇనుప రాడ్లతో దాడి జరగడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, అత్త, మామలతో కొనసాగుతున్న కుటుంబ విభేదాలే ఈ దారుణానికి కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రక్తపు మడుగులో పడి ఉన్న నరేశ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి అన్ని



04

కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపగా, మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

## డిప్యూటీ డైరెక్టర్ నరహరి రావుపై

# ఏసీబీ కేసు నమోదు



3



- ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు..
- తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు..భారీగా నగదు, బంగారం, ఆస్తుల గుర్తింపు
- రూ.13 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు
- నగదు, బంగారం, ప్లాట్లు, భూములు స్వాధీనం..
- జ్యుడీషియల్ రిమాండ్ కు సిద్ధం

**హైదరాబాద్, జూన్ 16 (ప్రభాత గమనం):**

తెలంగాణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలోని మల్టీ జోన్-2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. విధి నిర్వహణలో అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులను కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించిన ఏసీబీ అధికారులు, అవినీతి నిరో ధక చట్టం కింద కేసు నమోదు చేసి సోదాలు నిర్వహించారు.

## అందని ద్రాక్షగా..


# డోర్నకల్ అభివృద్ధి..?




04

ఒకవైపు కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ప్రకటనలు.. మరోవైపు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలు. ఇదే ప్రస్తుతం డోర్నకల్ మండల పరిస్థితిగా స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా, విద్య, తాగునీరు, అక్రమ ఇసుక-మట్టి దందాలు, అధిక ధరల వసూళ్లు, గనుల అక్రమాలు వంటి అనేక సమస్యలు మండలాన్ని వెంటాడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, అభివృద్ధి వాగ్దానాలు కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- వినియోగంలోకి రాని బస్టాండ్
- ప్రారంభం కాని ధోబీఘాట్
- జోరుగా అక్రమ ఇసుక, మట్టి, గనుల దందా
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రజా సమస్యలపై స్పందించని పాలకులు
- నీటి, విద్యా, ధరల నియంత్రణ సమస్యలతో సతమతమవుతున్న మండల ప్రజలు
- ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్




## విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు

# సమగ్ర కార్యాచరణ

- రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికలు : సీఎం రేవంత్ రెడ్డి
- వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం..
- రైతు వేదికలను సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు
- ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ఉన్నతాధికారుల ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- సన్న వడ్ల రైతులకు బోనస్ తో పాటు సబ్సిడీపై విత్తనాల పంపిణీ
- ఎరువుల బుకింగ్ కు యాప్, వ్యవసాయంలో ఏఐ వినియోగంపై సీఎం దృష్టి

**హైదరాబాద్, జూన్ 16 (ప్రభాత గమనం):**

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంటల కొనుగోళ్ల వరకు ప్రతి దశలో సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని, పంట సాగు ప్రారంభమైనప్పటి నుంచే పూర్తి సమాచార వ్యవస్థను రూపొందించాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో వర్షాకాల వ్యవసాయ సీజన్, ధాన్యం కొనుగోళ్లు, రైతులకు అందించాల్సిన సేవలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం ఈ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోళ్లపై ప్రత్యేక కమిటీ

వచ్చే సీజన్ నుంచే ధాన్యం కొనుగోళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ ఎండీ, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు. విత్తనాల పంపిణీ నుంచి పంటల నమోదు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు ప్రతి దశను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.

### ప్రతి పంటపై రైతుకు పూర్తి సమాచారం

రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నాడు, ఎంత విస్తీర్ణంలో పంటలు ఉన్నాయి, అంచనా దిగుబడులు ఎంత ఉంటాయనే వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ అందిస్తున్న నేపథ్యంలో ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. రైతు వేదికల ద్వారానే ఈ విత్తనాల పంపిణీ చేపట్టాలని, సన్న వడ్లు సాగు చేసే రైతుల పూర్తి డేటాను సిద్ధం చేయాలని సూచించారు.

### రైతు వేదికలు ఇక సేవా కేంద్రాలు

రైతు వేదికలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా రైతులకు ఉపయోగపడే సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకోవడం, విత్తనాలు, ఎరువులు పొందడం వంటి సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతు వేదిక వద్ద వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని, వీటి నిర్వహణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో అమలు చేస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) పైలట్ ప్రాజెక్టు ఫలితాలను అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని సీఎం అధికారులకు సూచించారు.

### యాప్ ద్వారా ఎరువుల బుకింగ్

ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంచేందుకు అన్ని రకాల ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతులు బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని, ఈ ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని పేర్కొన్నారు.

### కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపుల కోసం కేంద్ర ప్రభుత్వానికి నిరంతరం లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సీఎం సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను అత్యధికంగా తెలంగాణకు కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్ర మంత్రులు, ఎంపీల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు.

### మార్క్ ఫెడ్, ఆయిల్ ఫెడ్ బలోపేతం

మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వ్యాపారుల ఒత్తిడికి లొంగకుండా ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించడం వల్ల మొక్కజొన్న కొనుగోళ్లలో నష్టం తగ్గిందని పేర్కొన్నారు. గతంలో టన్ను మొక్కజొన్న రూ.13 వేలకే అమ్మిన పరిస్థితి ఉండగా, ఈసారి రూ.21 వేలకుపైగా టెండర్ రేటు వచ్చినట్లు వెల్లడించారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల బాట పట్టించాలని, ప్రభుత్వ డెయిరీని అభివృద్ధి చేసి పాల రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## అంగన్ వాడీలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- పెండింగ్ బకాయిలు, గ్రాట్యుటీని వెంటనే విడుదల చేయాలి
- గార్లలో అంగన్ వాడీల వినూత్న నిరసన
- సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం

**గార్ల, జూన్ 16 (ప్రభాత గమనం) :**

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం గార్ల స్థానిక గాంధీ పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి తమ ఆవేదనను వ్యక్తపరిచారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్, యూనియన్ జిల్లా నాయకురాలు నీలాదేవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ. 18,000 వేతనాన్ని పెంచాలని, ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్నికల హామీ ప్రకారం రూ.18 వేల వేతనం ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 15 వేల పోస్టులను ఒకేసారి భర్తీ చేయాలి.సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలి. పీఎఫ్ ప్రయోజనాలను అమలు చేయాలి.గతంలో జరిగిన 24 రోజుల సమ్మె కాలపు వేతనాలు, మినీ టీచర్స్ 11 నెలల ఎరియర్స్, అలాగే 2021 జూలై, అక్టోబర్, నవంబర్ నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలి.ఎలాంటి నిబంధనలు, షరతులు లేకుండా అంగన్‌వాడీలకు ఆసరా పెన్షన్ వర్తింపజేయాలి. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు, ఇన్‌క్రిమెంట్లు, ఇన్‌ఛార్జ్ అలవెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి.24 రోజుల సమ్మె ఒప్పందం ప్రకారం.. ఈ మధ్య కాలంలో మరణించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల కుటుంబాలకు రూ. 2 లక్షల ప్రమాద బీమా సొమ్మును అందించాలి.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎన్ఈపీ-2020' (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించి, ప్రీ-ప్రైమరీ (PP1) విద్యా విధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా కాలయాపన లేకుండా వెంటనే చెల్లించాలని కోరారు.ఈ వినూత్న నిరసన కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ చింత మౌనిక, తాళ్లూరి పద్మ, జి.సుజాత, బి.కృష్ణకుమారి, తార, ఉపేంద్ర, సరిత తదితర అంగన్‌వాడీ కార్యకర్తలు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## సీపీఐ బలోపేతమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలి

- జిల్లా కార్యదర్శి బి. విజయసారథి
- గార్ల మండల నూతన కార్యవర్గ, సమితి సభ్యుల ఎన్నిక

**గార్ల, జూన్ 16 (ప్రభాత గమనం) :**

ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిణామాలకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిప్రసాద్ భవన్‌లో సిపిఐ గార్ల మండల సమితి సమావేశం కృష్ణమూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ ముఖ్య సమావేశానికి బి. విజయసారథి ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రసంగించారు.ఇటీవల కాలంలో వివిధ పార్టీలు, సామాజిక రంగాల నుండి సిపిఐ పార్టీలో చేరిన పలువురు కీలక నాయకులను ఈ సమావేశంలో అధికారికంగా మండల సమితిలోకి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.సమావేశంలో ఏకగ్రీవంగా గార్ల మండల నూతన కార్యవర్గ మరియు మండల సమితి సభ్యులను ఎన్నుకున్నారు. మండల కార్యవర్గ సభ్యులుగా: మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్. మండల సమితి సభ్యులుగా: అన్నం శ్రీనివాస్, భూక్య పుల్సింగ్.మండల నూతన కార్యవర్గ సభ్యులుగా, సమితి సభ్యులుగా ఎన్నికైన వారికి సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి జిల్లా కమిటీ తరపున హృదయపూర్వక విప్లవాత్మక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మండలంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీ విస్తరణకు సమిష్టిగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని సిపిఐ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కాంట్రాక్టర్లతో మంత్రి కోమటిరెడ్డి భేటీ..

**హైదరాబాద్, జూన్ 16(ప్రభాత గమనం):**

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఉన్న కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కాంట్రాక్టర్ల ప్రతినిధులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బకాయిల చెల్లింపులతో పాటు ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అలాగే ఈ నెల 18న చేపట్టాలని నిర్ణయించిన 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విరమించుకోవాలని కాంట్రాక్టర్లను మంత్రి కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని ఆయన తెలిపారు.




## తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక..

**హైదరాబాద్, జూన్ 16(ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19వ తేదీ నుంచి వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విపత్తుల నిర్వహణ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ముందే తగిన రక్షణ చర్యలు చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించాలని సూచించారు. 18వ తేదీ తర్వాత ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు విస్తరించే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు.

## యువత భవిష్యత్తుకు గంజాయి శాపం

- గార్ల ఎస్సై సాయి కుమార్
- రైల్వే స్టేషన్ లో అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ..

**గార్ల, జూన్ 16 (ప్రభాత గమనం):**

సమాజంలో క్యాన్సర్‌లా పాకుతున్న గంజాయి మహమ్మారిని పూర్తిగా రూపుమాపడమే ధ్యేయంగా గార్ల రైల్వే పోలీసులు సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గార్ల సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) సాయి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో గంజాయి నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రయాణికులు, యువతకు సులభంగా అర్థమయ్యేలా గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించారు.ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ సాయి కుమార్ మాట్లాడుతూ.. నేటి యువత, విద్యార్థులు క్షణికానందం కోసం గంజాయి వంటి వ్యసనాలకు బానిసలై, తమ బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, లేదా వినియోగిస్తూ దొరికినా చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన గట్టిగా హెచ్చరించారు."గంజాయి రహిత సమాజ స్థాపన కేవలం పోలీసులతోనే సాధ్యం కాదు. ఇందులో ప్రతి పౌరుడి పాత్ర కీలకం. మీ పరిసరాల్లో ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు చేరవేసి బాధ్యతాయుతంగా వ్యవహరించండి."రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. అందరి కంటపడేలా ప్రవేశ ద్వారం వద్దే ఈ అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేయడంపై స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు కొనియాడారు.ఈ అవగాహన సదస్సులో పోలీస్ సిబ్బందితో పాటు, రైల్వే స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## నకిలీ విత్తనాల కట్టడికి కఠిన చర్యలు

- రైతులు నష్టపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్
- ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం..
- సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**ఖమ్మం, జూన్ 16(ప్రభాత గమనం):**


నకిలీ విత్తనాల కట్టడిపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులకు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం ప్రారంభమైన పరిస్థితుల్లో రైతులు పంట సేద్యం కోసం విత్తనాలను కొనుగోలు చేస్తున్నారని, ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసే రైతన్నలు నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంలో రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా నకిలీ విత్తనాలను కట్టడి చేయాలన్నారు. ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని ఆయన తన కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ, పొరుగున గల ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సరిహద్దుల నుండి ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా విజిబుల్ పోలీసింగ్ ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. చెక్ పోస్టుల ద్వారా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా వెంటనే చట్ట ప్రకారం జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను జప్తు చేయాలన్నారు. అదేవిధంగా మారుతున్న పరిస్థితులు, కొత్త సవాళ్లకు అనుగుణంగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన పోలీసింగ్ పై దృష్టి సారించాలన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఫీల్డ్ విజిట్ చేయాలని, నేరాల నియంత్రణలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంపొందించాలన్నారు. నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, వంటి ప్రతికూల ధోరణులకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాలను అడ్డుకునేందుకు, సైబర్ నేరాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించాలని, తద్వారా ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీ సునీల్ దత్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# డిప్యూటీ డైరెక్టర్ నరహరి రావుపై ఏసీబీ కేసు

- ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు..
- తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు.. భారీగా నగదు, బంగారం, ఆస్తుల గుర్తింపు
- రూ.13 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు
- నగదు, బంగారం, ప్లాట్లు, భూములు స్వాధీనం..
- జ్యుడీషియల్ రిమాండ్ కు సిద్ధం





**హైదరాబాద్, జూన్ 16 (ప్రభాత గమనం):**

తెలంగాణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలోని మల్టీ జోన్-2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. విధి నిర్వహణలో అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులను కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించిన ఏసీబీ అధికారులు, అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి సోదాలు నిర్వహించారు.

## 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

అవినీతి నిరోధక చట్టం-1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు మంగళవారం నరహరి రావు నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, అనుచరులకు చెందిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున స్థిర, చర ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, బ్యాంకు డిపాజిట్లు గుర్తించారు.

## భూములు, ప్లాట్లు, భవనాల వివరాలు

సోదాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ఐదు ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల విలాసవంతమైన ఫ్లాట్, నర్సింగిలో ఒక్కొక్కటి 1,860 చదరపు అడుగుల విస్తీర్ణం గల రెండు ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా గచ్చిబౌలిలోని టీఎన్జీఓ కాలనీలో జీ+3 భవనం, ఛత్రినాకలో జీ+2 నివాస భవనం కూడా నరహరి రావుకు సంబంధించిన ఆస్తులుగా ఏసీబీ గుర్తించింది.

## రూ.1.54 కోట్ల నగదు.. కిలోకుపైగా బంగారం

నరహరి రావు నివాసంలో నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.1.54 కోట్ల నగదు, రూ.2.29 కోట్ల బ్యాంకు నిల్వలు, రూ.5.04 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు వెలుగులోకి వచ్చాయి. అదనంగా సుమారు 1.3 కిలోల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన భార్య పేరిట ఉన్న రెండు లాకర్లను గుర్తించి వాటిని త్వరలో తెరిచి పరిశీలించనున్నట్లు వెల్లడించారు. సోదాల సందర్భంగా కియా కేరెన్స్ స్మార్ట్‌స్ట్రీమ్ జీ1.5 పెట్రోల్ కారును కూడా అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు సేకరించిన వివరాల ప్రకారం నరహరి రావుకు చెందిన ఆస్తుల విలువ రూ.13.05 కోట్లకుపైగా ఉన్నట్లు ఏసీబీ అంచనా వేసింది. అయితే మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల అసలు విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇంకా మరికొన్ని ఆస్తుల ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. నిందిత అధికారి సుంకరి నరహరి రావును నాంపల్లిలోని ఎస్పీఈ & ఏసీబీ కేసుల ప్రధాన ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట జ్యుడీషియల్ రిమాండ్ కోసం హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

## అవినీతిపై ఫిర్యాదులు చేయండి: ఏసీబీ

లంచం డిమాండ్ చేసిన ప్రజాప్రతినిధులు లేదా ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదులకు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని అధికారులు సూచించారు. అదేవిధంగా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB) ద్వారా కూడా ఏసీబీని సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.




### 24 గంటల్లోనే వీడిన

# మర్డర్ మిస్టరీ..

- భర్త హత్య కేసును ఛేదించిన పోలీసులు!
- నిత్యం వేధింపులు, అనుమానాలే కారణం..
- ఇనుప రాడ్ తో కొట్టి చంపిన భార్య, మరో ఇద్దరు..
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్ కు తరలింపు

**కేసముద్రం, జూన్ 16 (ప్రభాత గమనం) :**

కుటుంబ కలహాలు, మితిమీరిన మద్యం మత్తు, వివాహేతర సంబంధాల అనుమానాలు కలిసి చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కేసముద్రం మండలంలో తీవ్ర సంచలనం సృష్టించిన కుండే నరేష్ (32) హత్య ఉదంతాన్ని పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. కేసు నమోదైన కేవలం 24 గంటల్లోనే నిందితుల గుట్టు రట్టు చేసిన పోలీసులు.. మృతుడి భార్యతో సహా ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కుండే నరేష్‌కు, అతని భార్య అనూషకు గత కొంతకాలంగా అస్సలు పడటం లేదు. నరేష్ నిత్యం మద్యానికి బానిసై భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. దీనికి తోడు అతనికి ఇతర మహిళలతో సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు కూడా తోడవడంతో ఇంట్లో రోజూ నరకం కనిపించేది.ఈ గొడవలు ముదిరి నిన్న (జూన్ 15న) ఇరువర్గాలు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాయి. పోలీసులు ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించి వేశారు. అయితే, స్టేషన్ నుండి ఇంటికి వెళ్లే దారిలో కూడా నరేష్ నిందితులతో మళ్లీ గొడవకు దిగడం గమనార్హం. భర్త నుండి ఎదురవుతున్న నిరంతర వేధింపులను తట్టుకోలేకపోయిన అనూష, ఎలాగైనా అతడిని వదిలించుకోవాలని ముందస్తుగానే పక్కా ప్లాన్ వేసింది. అందుకోసం ఒక ఇనుప రాడ్‌ను కూడా సిద్ధం చేసి పెట్టుకుంది. జూన్ 15 రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో నరేష్ పూర్తి మద్యం మత్తులో ఇంటికి వచ్చి గొడవ ప్రారంభించగా, అదే సమయం కోసం వేచి చూస్తున్న నిందితులు ఒక్కసారిగా అతడిపై దాడి చేశారు. సిద్ధంగా ఉంచుకున్న ఇనుప రాడ్‌తో నరేష్ తలపై బలంగా పలుమార్లు బాదారు. తీవ్ర రక్తస్రావం కావడంతో నరేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి తండ్రి ఐలయ్య ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కేసముద్రం పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్ తమ సిబ్బందితో కలిసి ఈరోజు కేసముద్రం గ్రామ శివారులోని కోరుకొండపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది. కుండే అనూష (29) - మృతుడి భార్య (ఉప్పరపల్లి), కంకల కుమారస్వామి (46) - (ఉప్పరపల్లి), కంకల కలమ్మ (40) - (ఉప్పరపల్లి) పోలీసులు పంచుల సమక్షంలో నిందితులను విచారించగా, తామే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు వారు నేరాన్ని అంగీకరించారు. నిందితుల సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను, ఘటనా స్థలం నుండి పారిపోవడానికి వాడిన మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ వెల్లడించింది.



# ఈ నెల 18న 2కే రన్

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి
- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, జూన్ 16 (ప్రభాత గమనం ) :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2026 (ఎస్ఐఆర్-2026)పై ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 18వ తేదీన ఉదయం 7.00 గంటలకు 2కె రన్ నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ 2కె రన్ హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ప్రారంభమై, జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడంతో పాటు వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ 2కె రన్‌లో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పనులను నాణ్యతతో పూర్తి చేయాలి
- అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్లు, కుడా ఛైర్మన్

**వరంగల్, జూన్ 16 (ప్రభాత గమనం ) :**

వరంగల్ నగర పరిధిలోని చారిత్రక, పర్యాటక ప్రాధాన్యం కలిగిన ఉర్సుగుట్ట ప్రాంతాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) అజిత్ రెడ్డి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉర్సుగుట్ట పరిసర ప్రాంతాల్లో కుడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పర్యాటకులను ఆకర్షించేలా చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చర్యలు, సందర్శకులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఖిలా వరంగల్లు ప్రాంతంలో కొనసాగుతున్న మోటు రిజునవేషన్ అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే రంగ సముద్రం చెరువులో చేపడుతున్న పూడికతీత పనుల పురోగతిని సమీక్షించి, పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తదుపరి రంగలీల మైదానంలో కొనసాగుతున్న మైదానం చదును అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేస్తూ, వరంగల్ నగరాన్ని పర్యాటక, సాంస్కృతిక, పర్యావరణ పరంగా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్లు సూచించారు. ఈ పరిశీలనలో శాఖల అధికారులు పాల్గొని, ఆయా పను ల పురోగతికి సంబంధించిన వివరాలను కలెక్టర్లకు వివరించారు.





### చట్టసభల్లో బీసీలకు

# రిజర్వేషన్లు కల్పించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీ సంఘం డిమాండ్
- జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు ఘన నివాళి
- అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టడమే బహుజనుల కర్తవ్యం :కొండబత్తుల యాదగిరి

**గార్ల, జూన్ 16:(ప్రభాత గమనం)**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజ్యాంగ పదవులు, చట్టసభల్లో సముచిత స్థానం దక్కకపోవడం దారుణమని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు కొండబత్తుల యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో బీసీలకు తక్షణమే రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.మంగళవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబత్తుల యాదగిరి ప్రముఖ సామాజిక విప్లవకారులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం యాదగిరి మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో బహుజనులైన బీసీలను రాజ్యాంగ పదవులకు, అధికారానికి దూరంగా ఉంచేందుకు అగ్రకులాలు కుట్రలు పన్నుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే మిగిలిపోకూడదని, తమ రాజకీయ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టి, రాజ్యాధికారంలో భాగస్వామ్యం సాధించడమే నేటి బహుజనుల ముందున్న తక్షణ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వ సమాజం వ్యవస్థాపకులు విశ్వ జంపాల, బీసీ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు వేముల వెంకన్న, వడ్డేపల్లి సారంగపాణి, బొద్దుల రమేష్, దొంతు పురుషోత్తం తదితరులు పాల్గొని బీసీల హక్కుల సాధనకై గళం విప్పారు.

# భూ రీసర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలి

- సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి
- ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వే చేపట్టాలి
- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. రవి



**హనుమకొండ, జూన్ 16 (ప్రభాత గమనం ) :**

హనుమకొండ జిల్లాలో చేపట్టనున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో చేపట్టనున్న భూముల రీసర్వే పనులపై సర్వే అధికారులు, లైసెన్స్డ్ సర్వేయర్లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 14 మండలాల పరిధిలో 70 గ్రామాల్లో రీసర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రీసర్వే పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల సర్వేయర్లతో పాటు లైసెన్స్డ్ సర్వేయర్లను కలుపుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని భూమి కొలతల శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) నూర్ సింగ్‌ను ఆదేశించారు. అందుబాటులో ఉన్న ఆధునిక రోవర్ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూ సర్వేను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు, భూ యజమానుల సహకారంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. రీసర్వే చేపట్టనున్న గ్రామాల్లో జూలై 2వ తేదీన గ్రామసభలు నిర్వహించి, ప్రజలకు వివరాలు తెలియజేసిన అనంతరం సర్వే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక మండల సర్వేయర్‌తో పాటు ఇద్దరు లైసెన్స్డ్ సర్వేయర్లను నియమించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భూ రికార్డుల ఖచ్చితత్వం, పారదర్శకత, వివాదాల నివారణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.




# అందని ద్రాక్షగా.. డోర్నకల్ అభివృద్ధి..?

- వినియోగంలోకి రాని బస్టాండ్
- ప్రారంభం కాని ధోబీఘాట్
- జోరుగా అక్రమ ఇసుక, మట్టి, గనుల దందా
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రజా సమస్యలపై స్పందించని పాలకులు
- నీటి, విద్యా, ధరల నియంత్రణ సమస్యలతో సతమతమవుతున్న మండల ప్రజలు
- ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్

**మహబూబాబాద్, జూన్ 16 (ప్రభాత గమనం):**

ఒకవైపు కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ప్రకటనలు.. మరోవైపు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలు. ఇదే ప్రస్తుతం డోర్నకల్ మండల పరిస్థితిగా స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా, విద్య, తాగునీరు, అక్రమ ఇసుక–మట్టి దందాలు, అధిక ధరల వసూళ్లు, గనుల అక్రమాలు వంటి అనేక సమస్యలు మండలాన్ని వెంటాడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, అభివృద్ధి వాగ్దానాలు కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### నిరుపయోగంగా బస్టాండ్..

డోర్నకల్‌లో నిర్మించిన బస్ స్టాండ్ ఇప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ ఆశించిన ప్రయోజనం లేకపోవడంతో ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇదే తరహాలో ధోబీఘాట్ నిర్మాణం పూర్తయినా, కేవలం ఒక ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రారంభానికి నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.




### రైల్వే టవర్ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు

ఎర్రమట్టి తండా సమీపంలోని రైల్వే మైక్రో టవర్ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పర్యవేక్షణ పెరగకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు.

### జోరుగా అక్రమ ఇసుక, మట్టి దందా

మండలంలో అక్రమ ఇసుక, మట్టి రవాణా బహిరంగంగానే సాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో భారీ ఎత్తున ఇసుక తరలింపులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు కేసులు నమోదు చేయడం లేదని చెబుతున్నారు. మట్టి తవ్వకాలు, రవాణాపై కూడా ఎలాంటి నియంత్రణ కనిపించడం లేదని అంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్ష

డోర్నకల్ వంటి ప్రముఖ మండల కేంద్రంలో ఇప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతమంది విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### వెంటాడుతున్న తాగునీటి సమస్య

ప్రతి వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు, నీటి నిల్వల పెంపుపై చర్యలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన భారీ మోటార్లు చోరీకి గురైన ఘటనలో ఇప్పటివరకు కేసు నమోదు కాకపోవడం ప్రజల్లో ఆశ్చర్యం కలిగిస్తోంది.

### ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలు

మండలంలోని పలు వైన్ షాపుల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో అదనపు భారం పడుతోందని చెబుతున్నారు.

### గనుల్లో అక్రమ బ్లాస్టింగ్.. పెరుగుతున్న భయాందోళనలు

కంకర, స్టోన్ డస్ట్ ధరలను క్రషర్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా పెంచుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గనుల్లో అక్రమ బ్లాస్టింగ్ జరుగుతోందని, దీనివల్ల సమీప గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు. అయినప్పటికీ తనిఖీలు, కేసుల నమోదు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

### నిద్రమత్తులో అధికార యంత్రాంగం

అటవీ, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ నియంత్రణ వంటి కీలక శాఖల పరిధిలో నిబంధనల అమలు సరిగా జరగడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ శాఖల పరిధిలో కేసులు నమోదు కావడం చాలా అరుదుగా కనిపిస్తోందని, చట్టాల అమలులో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు.

### ప్రజా సమస్యలపై స్పందించని పాలకులు

డోర్నకల్ మండలంలో పేరుకుపోతున్న సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖలు ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి పనుల ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే సమస్యల భారంతో ప్రజల అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఎరువుల దుకాణంపై టాస్క్ ఫోర్స్ దాడులు

**హన్మకొండ జూన్ 16(ప్రభాత గమనం):**

కమలాపురం మండలం అంబాల గ్రామంలో శ్రీరామ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో సుమారు రూ.57,665 విలువైన గడువు ముగిసిన పురుగుమందులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని యజమాని కుక్కల ప్రభాకర్ ను కేసు నమోదు నిమిత్తం కమలాపురం పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.



# పాఠశాలలో టీచర్ వింత ప్రవర్తన..

**జనగామ జూన్ 16(ప్రభాత గమనం):**

పాఠశాలలో విద్యార్థుల పట్ల అనుచితంగా (వింతగా) ప్రవర్తిస్తున్న ఈ టీచర్ మాకొద్దంటూ మంగళవారం నిరసన వ్యక్తం చేసిన ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. చిల్పూర్ మండలంలోని ఓ హై స్కూల్లో ఇంగ్లిష్ టీచర్ జనగణన సమయంలో విద్యార్థినిని అనవసరపు ప్రశ్నలు వేశారు. ఈ విషయంపై సర్పంచ్ రాజు ఆమెను ప్రశ్నించగా..పుస్తకాలు విసరడం, వెకిలిగా నవ్వడం, హెచ్‌ఎం కుర్చీలో కూర్చోవడం, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో స్థానికులు అవాక్కయ్యారు.




# తగ్గిన బంగారం, వెండి ధరలు..

**హైదరాబాద్, జూన్16 (ప్రభాత గమనం):**

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. కిలో వెండి ధర రూ.5 వేల మేర తగ్గి రూ.2,75,000 వద్ద కొనసాగుతోంది. అలాగే 10 గ్రాముల 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.160 తగ్గి రూ.1,51,370కు చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.150 తగ్గి రూ.1,38,750 వద్ద నమోదైంది. బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ధరల తగ్గుదల కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. అయితే ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపాయి.

# తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

**కేసముద్రం, జూన్ 16(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామంలో మంగళవారం ఉదయం ఒక తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఒక వృద్ధ గీత కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. కల్వల గ్రామానికి చెందిన గీత కార్మికుడు వేముల మల్లేశం (65) ప్రతిరోజూలాగే మంగళవారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. అయితే, చెట్టుపై పని చేసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా అదుపుతప్పి పైనుంచి కిందపడిపోయాడు. చాలా ఎత్తు నుంచి కింద పడటంతో ఆయన తలకు, శరీర భాగాలకు తీవ్రమైన గాయాలయ్యాయి. రక్తస్రావం ఎక్కువగా కావడంతో మల్లేశం అక్కడికక్కడే కన్నుమూశారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు మల్లేశంకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కష్టపడి కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. గ్రామంలో మంచి వ్యక్తిగా పేరున్న మల్లేశం మరణంతో కల్వల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.





# బడి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

- సీపీఐ మండల నాయకుడు మంద భాస్కర్

**కేసముద్రం జూన్ 16(ప్రభాత గమనం):**


కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండాలో అసంపూర్తిగా ఉన్న బడి నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం అసంపూర్తిగా ఉన్న బడి భవన నిర్మాణాన్ని సీపీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ బ్రహ్మంగారి తండాలో 2001 నుండి సొంత భవనం లేక విద్యార్థులు అద్దె భవనంలో, మధ్యాహ్న భోజన వంట మనిషి ఇంటిలోని రేకుల షెడ్డు కింద చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో మన ఊరు– మన బడి పథకం కింద పాఠశాల భవనం మంజూరైనప్పటికీ నేటికీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ పాల్గొన్నారు.

# యువకుడి దారుణ హత్య

- కేసముద్రం మండలంలో దారుణం:
- అత్తగారింట్లోనే అల్లుడి దారుణ హత్య!
- కుటుంబ కలహాలే కారణమనే అనుమానాలు
- ఇనుప రాడ్లతో తలపై బాది ఘాతుకం
- మహబూబాబాద్ జిల్లా ఉప్పరపల్లిలో కలకలం

**కేసముద్రం, జూన్16(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఘోరం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి అత్తగారింట్లోనే దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇనుప రాడ్లతో తలపై బలంగా కొట్టడం వల్లే సదరు వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కుండె నరేశ్ (36)కు, అదే గ్రామానికి చెందిన కంకల కుమారస్వామి, కనకమ్మ దంపతుల కుమార్తె అనూషకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, కొంతకాలంగా కుటుంబంలో రేగుతున్న కలహాలే ఈ ఘాతుకానికి దారితీసినట్లు సమాచారం. సోమవారం రాత్రి అత్తగారింటికి వెళ్లిన నరేశ్‌పై అత్త ,మామ,భార్యలు ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారని తెలిసింది. తలపై తీవ్రమైన గాయాలు కావడంతో నరేశ్ అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి మృతి చెందాడు.ఘటనపై సమాచారం అందుకున్న కేసముద్రం ఎస్సై క్రాంతికిరణ్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని, క్లూస్ టీమ్ ఆధారాలను పరిశీలించారు. అనంతరం శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రాథమిక సమాచారం ప్రకారం కుటుంబ కలహాల వల్లే ఈ హత్య జరిగినట్లు అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టింది ఎవరు? కుటుంబ సభ్యులే ఈ పని చేశారా లేక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఒకే గ్రామంలో అల్లుడు దారుణ హత్యకు గురికావడంతో ఉప్పరపల్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABAD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374